సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం : 2 : జనవరి : 2023

గరిష్టం / కనిష్టం
31° / 19°

వాతావరణం

జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. రాత్రి వేళలో చలి తీవ్రత ఉండవచ్చు.

న్యూస్‌రీల్

శ్రీకనకదుర్గమ్మతల్లికి విశేష పూజలు



పెద్దమ్మతల్లి ఆలయం ఎదుట భక్తుల రద్దీ

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గమ్మ తల్లికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి)ఆలయానికి ఆదివారం నూతన సంవత్సరం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు క్యూలైన్ ద్వారా వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. పూజలు నిర్వహించారు. తలనీలాలు సమర్పించారు. ఒడిబియ్యం, చీరలు, కుంకుమ, పసుపు, గాజులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు అమ్మవారికి అభిషేకం జరిపారు. ఈఓ ఎన్.రజనీకుమారి పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

నేడు ప్రజావాణి రద్దు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా అధికారులందరూ ముక్కోటి ఉత్సవాల విధుల్లో ఉన్నందున ప్రజాసమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం రద్దు చేస్తున్నట్లు డీఆర్‌ఓ అశోకచక్రవర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు దరఖాస్తులు అందజేయడానికి కలెక్టరేట్‌కు రావొద్దని సూచించారు.

శాస్త్రీయ ఆలోచన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న కుమార్

కొత్తగూడెంఅర్బన్: ప్రతి ఒక్కరూ శాస్త్రీయ ఆలోచనా విధానం కలిగి ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం కొత్తగూడెం రైటర్ బస్తీలోని ప్రకృతి ఆశ్రమంలో ఏర్పాటు చేసిన జన విజ్ఞాన వేదిక (జేవీవీ) జిల్లా మహాసభలో ఆయన ప్రసంగించారు. అంధవిశ్వాసాలు, ఛాందస భావాలను రూపుమాపితేనే సమాజం ముందుకు పోతుందని అన్నారు. శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజానికి అందించడం కోసం ఎంతోమంది జీవితాలను త్యాగం చేసి గొప్ప ఆవిష్కరణలు గావించారని పేర్కొన్నారు. అలాంటి ఆలోచనలను నేటితరానికి అందించగలిగితేనే సమ సమాజ స్థాపన జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ తెలంగాణ రాష్ట్ర నాయకులు డాక్టర్ బత్తుల కృష్ణయ్య, మొక్కల వెంకటయ్య, మారపాక రమేష్, సైన్స్ ఉపాధ్యాయులు కుమార్, సీనియర్ రాజకీయ నాయకులు తాళ్లూరి వెంకటేశ్వరరావు, ప్రముఖ న్యాయవాది వూటుకూరి పురుషోత్తమరావు, గుండపనేని సతీష్, జే.బీ శౌరి, బిక్కులాల్, మల్లెల రామనాథం, నాగ సీతారాములు, లగడపాటి రమేష్, మోదుగు జోగారావు, వి కోటంరాజు, ప్రిన్సిపాల్ శైలజ, బీ.లక్ష్మి , శిరీష, చార్వాక తదితరులు పాల్గొన్నారు.

ఈ సేవా కేంద్రాలకు దరఖాస్తుల ఆహ్వానం



వివరాలు వెల్లడిస్తున్న సీఈఓ శ్రీధర్

కొత్తగూడెంటౌన్: నిరుద్యోగుల నుంచి స్వచ్ఛ్ ఈ సేవా కేంద్రాల ఏర్పాటు కోసం ఈ నెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని స్వచ్ఛ్ ఈ సేవా యూత్ ఎంప్లాయిమెంట్ సీఈఓ సీహెచ్.శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ బిల్లుల చెల్లింపులు, బస్సు, విమాన టికెట్లు బుకింగ్, కొత్త పాన్‌కార్డు, చేర్పులు, మార్పులు, వివిధ టెలికాం పోస్ట్ పెయిడ్, ప్రీ పెయిడ్ రీచార్జ్‌లు, అన్ని బ్యాంకుల మనీ ట్రాన్స్‌ఫర్ లావాదేవీలు, ఆధార్ ఆధారిత పేమెంట్ సిస్టం, మైక్రో ఏటీఎం సేవలు, డేటా కార్డు, ల్యాండ్ లైన్ బిల్ పేమెంట్స్, డీటీహెచ్, ఇన్సూరెన్స్ పేమెంట్ వంటి సేవలను ఈ కేంద్రాల ద్వారా అందించవచ్చని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ, దివ్యాంగులు, ఉద్యోగ విరమణ చేసినవారు, మహిళా అభ్యర్థులకు ఫీజులో ప్రత్యేక తగ్గింపు ఉంటుందని తెలిపారు. www.swacheseva.com, email care@swacheseva.com ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సీఈఓ సీహెచ్ శ్రీధర్ తెలిపారు.



గోదావరి నదిలో హంస వాహనంపై జలవిహారం చేస్తున్న స్వామి వారు





ఊరేగింపులో శ్రీసీతారామ చంద్రస్వామివారు

కనుల పండువగా..

రామయ్య జలవిహారం..

- భద్రగిరి రామునికి వైభవంగా తెప్పోత్సవం
- భక్త జన సంద్రంగా మారిన గోదావరి తీరం
- పర్యవేక్షించిన కలెక్టర్ అనుదీప్, ఎస్పీ వినీత్

భద్రాచలం: పండితుల వేదమంత్రోచ్ఛరణలు, భక్తజనం జయజయ ధ్వానాల నడుమ సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్య స్వామి గోదావరిలో జలవిహారం చేశారు. రాములోరి నదీ విహారంతో గోదావరి తల్లి పులకించగా ఈ దృశ్యాలను చూసి భక్తులు ఆనంద పరవశులయ్యారు. భద్రగిరి క్షేత్రం ఆధ్యాత్మిక శోభతో నిండిపోయింది. భద్రాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం పవిత్ర గోదావరి నదిలో తెప్పోత్సవం(ప్లవోత్సం) కనుల పండువగా సాగింది.

ఊరేగింపుగా నదీ తీరానికి..

పగల్‌పత్తు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవ మూర్తులకు విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం ఇచ్చారు. ఉదయం సేవాకాలం, శ్రీ తిరుమంగై ఆళ్వార్‌లు పరమపదోత్సవం జరిగింది. మధ్యాహ్నం రాజభోగం, శాత్తుమురై, పూర్ణ శరణాగతితో పగల్ పత్తు ముగిసింది. గర్భగుడిలో ప్రభుత్వోత్సవం(దర్బార్ సేవ) నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాల నడుమ స్వామి వారిని ఊరేగింపుగా తెప్పోత్సవం కోసం ఆలయం నుంచి గోదావరి తీరానికి తీసుకెళ్లారు.

ఉత్తర ముఖంగా..

ఆగమ శాస్త్ర పూజాధికాలు పూర్తయిన తర్వాత సాయంత్రం 6 గంటల సమయంలో ఉత్తర ముఖంగా గోదావరి నదిలో హంస వాహనం కదిలింది. నిశ్చలంగా ఉన్న గోదావరి నదిలో విద్యుత్ దీప కాంతులతో ధగధగ మెరుస్తున్న హంస వాహనం, అందులో ఆశీనులైన సీతారాములను చూసేందుకు భక్తులు పోటీ పడ్డారు. తెప్పోత్సవం మొదలైన వెంటనే నదికి ఆవలి తీరంలో బాణసంచా కాల్చడం మొదలైంది. నదిలో హంస వాహన ప్రతిబింబం, ఆకాశంలో బాణసంచాలు వెలువరిస్తున్న రంగురంగుల మెరుపుల మధ్య గోదావరి తీరం ప్రత్యేక శోభ సంతరించుకుంది. కనుల పండువగా రామయ్య జలవిహారం కొనసాగింది. ఒక్కో పరిక్రమాణానికి సగటున 12 నిమిషాల సమయం పట్టింది. మొత్తంగా ఐదు పరిక్రమణాలు పూర్తయ్యే సరికి రాత్రి 7:01 గంటలైంది. తెప్పోత్సవం ముగిసిన అనంతరం ఆగమ శాస్త్ర పద్ధతులు అనుసరిస్తూ సీతారాములను తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు.

ఆకట్టుకున్న కోలాటం

ఆలయంలో ప్రత్యేక పూజలు అందుకున్న స్వామి వారు సాయంత్రం 4గంటలకు ప్రత్యేక పల్లకిపై ఊరేగింపుగా గోదావరి తీరానికి బయలు దేరారు. తెప్పోత్సవానికి పల్లకిలో స్వామి వారు వెళ్లే సమయంలో పల్లకి ముందు వివిధ సంస్థల ఆధ్వర్యంలో మహిళలు చేసిన కోలాట ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పురుషోత్తపల్లి నుంచి వచ్చిన మహిళల బృందం చేసిన డప్పు నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

కట్టుదిట్టమైన భద్రత

తెప్పోత్సవాన్ని కలెక్టర్ అనుదీప్ భద్రాచలంలోనే ఉండి పర్యవేక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ వినీత్, ఏఎస్పీ రోహిత్ రాజ్ పర్యవేక్షించి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమాల్లో భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య, అడిషనల్ కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, ఆపరేషన్స్ ఓఎస్డీ సాయిమనోహర్, భద్రాచలం ఆర్డీఓ రత్న కల్యాణి, ఆలయ ఈఓ శివాజీ, ఏఈఓ శ్రవణ్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్, అర్చకులు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తుల సందడి

శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. నూతన ఆంగ్ల సంవత్సరాదితో పాటుగా ఆదివారం, తెప్పోత్సవం కావడంతో భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారి దర్శనానికి బారులుదీరారు. ఆర్జిత సేవలతో పాటుగా సర్వదర్శనాలలో క్యూలైన్లలో ద్వారా అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

పల్లకిలో గోదావరికి..

సాయంత్రం 4గంటలకు ప్రత్యేక పల్లకిపై ఊరేగింపుగా గోదావరి తీరానికి సీతారాములు బయల్దేరారు. పల్లకి ముందు కోలాటం ఆడుతూ గోదావరి వైపుగా రాముడితో పాటు భక్తజనులు కదిలివచ్చారు. శ్రీ సీతారామచంద్ర స్వామివారిని చూసి తరించేందుకు దారి పొడవునా బారులుదీరారు. గోదావరి తీరానికి చేరిన తర్వాత అర్చకులు ముందుగా పుణ్య జలాలతో హంస వాహనాన్ని సంప్రోక్షణ చేశారు. ఊరేగింపుగా వచ్చిన స్వామి వారిని హంసవాహనం చెంతకు తీసుకువచ్చారు. అందులో ఏర్పాటు చేసిన పచ్చిపూల మండపంలో తూర్పు ముఖంగా దేవేరులను వేంచేయింప చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు చతుర్వేదాలు, నాళాయిర దివ్యప్రబంధం, పంచసూత్రాలు, స్తోత్ర పాఠాలు చదివారు. అనంతరం మంగళహారతి, చక్రపొంగలి నివేదనలో సుమారు గంట పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చివరగా హారతి ఇచ్చి వీఐపీలను దర్శనానికి అనుమతి ఇచ్చారు.

పట్టువస్త్రాలు సమర్పించిన రెవెన్యూ శాఖ



ఈఓకు పట్టువస్త్రాలను అందజేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్

తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనంలో స్వామి వారికి అలంకరించేందుకు భద్రాచలం రెవెన్యూ అధికారులు ఆదివారం పట్టువస్త్రాలను అందచేశారు. ఆలయ నిర్మాత, నాటి తహసీల్దార్ భక్త రామదాసు కాలం నుంచి ఏటా రెవెన్యూ అధికారులు ఆలయ అధికారులకు పట్టువస్త్రాలను అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలోనే భద్రాచలం తహశీల్దార్ శ్రీనివాస్ యాదవ్ ఆలయ ఈఓ శివాజీకి వస్త్రాలను అందించారు. ఏఈఓ శ్రవణ్‌కుమార్, సీసీ అనిల్, ముఖ్య అర్చకులు మురళీకృష్ణమాచార్యులు, ఆర్ఐ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



పర్యవేక్షిస్తున్న కలెక్టర్ అనుదీప్, అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు



రామాలయంలో భక్తుల సందడి



తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

నేడు ఉత్తర ద్వార దర్శనం

వీక్షిస్తే పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం



రామాలయంలో ఉత్తర ద్వారం(ఫైల్)

భద్రాచలం: రామాలయంలో సోమవారం తెల్లవారుజామున శ్రీసీతారామ చంద్రస్వామి వారు ఉత్తర ద్వారంలో దర్శనమివ్వనున్నారు. వైకుంఠ ఏకాదశి రోజున ఉత్తర ద్వారంలో స్వామి వారిని దర్శించుకుంటే సకల పాపాలు తొలగిపోతాయని భక్తులు విశ్వసిస్తారు. ఏడాదిలో ఒకసారి మాత్రమే స్వామి వారు ఇలా ఉత్తర ద్వారంలో దర్శనమిస్తారు. ఆ మహత్తర దృశ్యాన్ని చూసేందుకు భక్తులు వేయి కళ్లతో వేచిచూస్తున్నారు. ఇప్పటికే దూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన పలువురు భక్తులు భద్రాచలంలోనే బస చేశారు. ఉత్తర ద్వార దర్శనం తిలకించేందుకు వీలుగా దేవస్థానం ఆధ్వర్యంలో సెక్టార్లుగా విభజించారు. వీవీఐపీలు, వీఐపీలు, ఇతర టికెట్ ధరలకు అనుగుణంగా సెక్టార్లను అధికారులు కేటాయించారు. ఉత్తర ద్వార దర్శనం వేడుకల్లో వీఐపీలకు, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కలెక్టర్ అనుదీప్, ఎస్పీ వినీత్‌ల ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉత్తరద్వారం తెరిచే వేళ

ఉత్తర ద్వారం దర్శనం సమయంలో వివిధ కార్యక్రమాలు జరుగనున్నాయి. తెల్లవారుజామున 3గంటల నుంచి 4.30 గంటల వరకు సంగీత కళాకారులు, దేవస్థానం హరిదాసుల బృందంచే కీర్తనలు, ఆలాపనలు ఉంటాయి. 4.30 గంటల నుంచి 5 గంటల వరకు వైకుంఠ ఏకాదశి వైభవం ఉంటుంది. 5 గంటలకు మంగళ వాయిద్యాలు, వేదఘోష నడుమ వైకుంఠ ద్వారం తెరుచుకుంటుంది. 5.01 గంటల నుంచి 5.11 గంటల వరకు వినతాసుత వాహన కీర్తన నాదస్వరం ఉంటుంది. 5.11 గంటల నుంచి 5.21 గంటల వరకు ఆరాధన, శ్రీరామ షడక్షరి మంత్ర సంపుటిత అష్టోత్తర శతనామార్చన నిర్వహిస్తారు. 5.30 గంటల నుంచి 5.40గంటల వరకు స్థానాచార్యులచే ద్వార దర్శన ప్రాశస్తం చెప్పబడుతుంది. ఆ తర్వాత 108 ఒత్తులతో హారతినిస్తూ శరణాగతి గద్యవిన్నపం చేస్తారు. 6గంటలకు అదిగో కోదండపాణి కీర్తనతో వైకుంఠ ద్వారం నుంచి శ్రీ స్వామి వారి ఉత్థాపన జరుగుతుంది. ఆ తర్వాత భక్తులకు స్వామి మూలవరుల దర్శనం కల్పిస్తారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

బీజాపూర్‌లో నలుగురు కాంట్రాక్టర్ల అదృశ్యం

మావోయిస్టులు కిడ్నాప్ చేశారని కుటుంబీకుల అనుమానం

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన నలుగురు కాంట్రాక్టర్లను మావోయిస్టులు కిడ్నాప్ చేసినట్లు తెలుస్తోంది. బీజాపూర్ జిల్లా కేంద్రానికి చెందిన నలుగురు కాంట్రాక్టర్లు 8 రోజులుగా కనిపించకుండాపోవడంతో వారిని మావోయిస్టులే కిడ్నాప్ చేసి ఉంటారని అనుమానిస్తూ ఆదివారం రాత్రి కాంట్రాక్టర్ల కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా.. బీజాపూర్ జిల్లా కేంద్రంలో ఉంటున్న కొండగావ్‌కు చెందిన నిమోంద్రకుమార్ దేవాన్, నీల్‌చంద్‌నాగ్‌తో పాటు లోహందీగూడకు చెందిన తేమ్రునాగ్, బర్సూర్‌కు చెందిన చప్పిడి బత్తయ్యలు గత నెల 24న బీజాపూర్ జిల్లాలోని గోర్నా సమీపంలో గల అటవీ ప్రాంతానికి వెళ్లారు. అయితే వారు ఆ ప్రాంతానికి వెళ్లి 8 రోజులు గడిచాయి. శుక్రవారం రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో మావోయిస్టులు వారిని కిడ్నాప్ చేసి ఉంటారని భావిస్తూ కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా మావోయిస్టు వారిని కిడ్నాప్ చేసి ఉంటే మానవతా దృక్పథంతో విడిచిపెట్టాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



సంతకాలు సేకరిస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్రంలో బీసీ వర్గాలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేర్రా కామేష్ కోరారు. బీసీలకు రిజర్వేషన్లు పెంచాలనే డిమాండ్‌తో ఆదివారం పట్టణంలోని బస్టాండ్ వద్ద సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు పమర్తి అంకినీడు ప్రసాద్ గౌడ్ ప్రారంభించగా, కామేష్ మాట్లాడుతూ బీసీ జనాభా 50 శాతానికి పైగా ఉంటే విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 27 శాతం మాత్రమే రిజర్వేషన్లు అమలవుతున్నాయని పేర్కొన్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని కోరారు. రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు 50 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేవారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ గంధం మల్లికార్జున్‌రావు, నాయకులు బాపనపల్లి కళ్యాణ్, వంగా రవిశంకర్, నాగుల రవికుమార్, కోమలి, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణా తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి ఆదివారం నూతన సంవత్సరం సందర్భంగా భక్తులు పోటెత్తారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 25వేల మంది భక్తులు స్వామివారిని దర్శనం చేసుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో ప్రాంగణం మార్మోగింది. శ్రీవేంకటేశ్వర స్వామి, శ్రీ అలివేలు మంగమ్మ అమ్మవారిని, శ్రీపద్మావతి అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. కాగా, వేంకటేశ్వరస్వామి ఆలయానికి లడ్డూలు, వాహన పూజలు, తలనీలాల టికెట్ల ద్వారా ఒక్క రోజే రూ.5.01 లక్షల ఆదాయం వచ్చింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా శ్రీవేంకటేశ్వర సేవా సమితి, మధిర పట్టణానికి చెందిన సత్య సాయి సేవా సమితి సభ్యులు సేవలందించారు.

నూతనోత్సాహం..

ఘనంగా కొత్త సంవత్సరం వేడుకలు

కొత్తగూడెంటౌన్: నూతన సంవత్సర వేడుకలను ఆదివారం జిల్లా వ్యాప్తంగా ప్రజలందరూ ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చర్చిలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇళ్ల ముందు అందమైన ముగ్గులు వేసి రంగులతో తీర్చిదిద్దారు. జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం, రామవరం, పాలకేంద్రం, విద్యానగర్ కాలనీ, పాత కొత్తగూడెం, హెడ్ ఆఫీస్ ఏరియా, హనుమాన్‌బస్తీ, రైటర్‌బస్తీ, బస్టాండ్ ఏరియా తదితర ప్రాంతాలతోపాటు పాల్వంచ, భద్రాచలం, ఇల్లెందు, అశ్వారావుపేట, మణుగూరు ప్రాంతాల్లో వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా గాంధీపథం జిల్లా కన్వీనర్ చింతల చెర్యూ గెర్షెం ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జిల్లా జడ్జి శాంతిరాము, అనుష్క, జ్ఞాన వినోదిని తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

కొత్తగూడెంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ జి.వినీత్ కేక్ కట్ చేశారు. అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి.సాయి మనోహర్, కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, పాల్వంచ డీఎస్పీలు వెంకటేశ్వర బాబు, రమణమూర్తి, రాఘవేందర్‌రావు, సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ విజయ్‌బాబు, డీసీఆర్బీ డీఎస్పీ నందీరామ్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



జిల్లా ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖర ప్రసాద్ దంపతులకు సన్మానం..



నూతన సంవత్సర వేడుకల్లో ఎస్పీ డాక్టర్ వినీత్, ఇతర పోలీస్ అధికారులు

రామవరంలో..

రామవరంలోని అంబేద్కర్ భవన్‌లో మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో కొయ్యాడ వెంకటేశ్వర్లు, సామర్ల సమ్మయ్య, బరిగెల భూపేష్, మాటేటి గోపాల్ సావేటి స్వామి, ఐ.శంకర్, కాంపెల్లి దుర్గయ్య, ఇల్లెందుల పోషయ్య, మద్దికుంట గణేష్, నమిల్ల మధు, చెరిపెల్లి కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అజయ్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు

భద్రాచలంఅర్బన్: బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తెల్లం వెంకట్రావు, ఇతర నాయకులు ఆదివారం ఖమ్మం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సత్కరించారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అరికెల తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కొండిశెట్టి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు రమాకాంత్, దుమ్ముగూడెం జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, భద్రాచలం బీఆర్ఎస్ మండలం మహిళా అధ్యక్షురాలు గంగాభారతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారు, మోటార్‌సైకిల్ ఢీ..
ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు

బూర్గంపాడు: సారపాక సమీపంలోని పుష్కర వనం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాల్వంచకు చెందిన సాయిదీక్షిత్, అజయ్, హేమంత్ అనే ముగ్గురు యువకులు మోటార్ సైకిల్‌పై భద్రాచలం వెళ్తున్నారు. సారపాక పుష్కరవనంకు సమీపంలో భద్రాచలం నుంచి వస్తున్న కారు, మోటార్‌సైకిల్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో మోటార్ సైకిల్‌పై వస్తున్న ముగ్గురు యువకులు తీవ్ర గాయల పాలయ్యారు. అనంతరం క్షతగాత్రులను భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

అశ్వారావుపేటరూరల్: పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడి చేసిన సంఘటన ఆదివారం మండల పరిధిలోని అచ్యుతాపురం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై సాయికిశోర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ప్రకారం.. మండల పరిధిలోని అచ్యుతాపురం గ్రామ సమీపంలోని ఓ తోటలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురి వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.3,400 నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోడి పందేల స్థావరంపై..

అశ్వారావుపేటరూరల్: కోడి పందేల స్థావరంపై ఆదివారం మధ్యాహ్నం పోలీసులు దాడి చేశారు. స్థానిక ఎస్సై సాయికిశోర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నల్లబాడు గ్రామ సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారనే పక్కా సమాచారంతో పోలీసులు తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులు అరెస్ట్ కాగా, వారి వద్ద నుంచి రూ.4,500 నగదు, మూడు కోడి పుంజులు, 5 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

ఊట్లపల్లి గ్రామ సమీపంలో..

మండల పరిధిలోని ఊట్లపల్లి గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై ఎస్సై సాయికిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.2,800 నగదుతో పాటు రెండు పందెంకోళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని ఎలక్ట్రీషియన్ దుర్మరణం


రమేష్ (ఫైల్)

పాల్వంచ: నూతన సంవత్సరం ఆ కుటుంబంలో విషాదం నింపింది. ఓ వైపు నూతన సంబరాలు జరుగుతుండగా మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ఎలక్ట్రీషియన్ ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొని దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన రాపోలు రమేష్(42) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి 12.40 గంటలకు ద్విచక్ర వాహనంపై పెద్దమ్మగుడికి వైపు పనికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో రెజీనా స్కూల్ వద్ద రోడ్డు వంపులుగా ఉండటంతో బండి స్కిడ్ అయి డివైడర్ అంచులకు తల బలంగాతగిలింది. దీంతో రమేష్ అక్కడిక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు పట్టణ ఎస్సై నరేష్ కేసు నమోద్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బైక్‌ను ఢీకొట్టిన లారీ..


ప్రహరీని ఢీకొట్టి ఆగిన లారీ

అశ్వారావుపేటరూరల్: ఎదురుగా వస్తున్న బైక్‌ను ఓ లారీ ఢీకొట్టిన ఘటన ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని వికలాంగుల కాలనీకు చెందిన ఆదేపు రామకృష్ణ తన బైక్‌పై అశ్వారావుపేట నుంచి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో స్థానిక గిరిజన భవన్ వద్ద బైక్‌ను ఖమ్మం నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొట్టి, ఆ తర్వాత గిరిజన భవన్‌లోకి దూసుకెళ్లి ప్రహరీ గోడను ఢీకొట్టి ఆగింది. ఈ ప్రమాదంలో రామకృష్ణకు తీవ్ర గాయాలు కాగా, ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆస్పత్రికు తరలించారు. లారీ డ్రైవర్‌ను నారంవారిగూడెం వద్ద గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురం గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సీతంపేట గ్రామానికి చెందిన గోపికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం..గోపి ద్విచక్రవాహనంపై ఖమ్మం వైపు వెళ్తూ ఆగి ఉన్న కారును ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



● జల విహారం..

వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా సీతారామచంద్రస్వామి వారు జలవిహారం చేశారు. అధికారులు సిద్ధం చేసిన హంస వాహనం (లాంచి)లో సీతా సమేతుడైన రాములవారు నీటిపై విహరించారు. తెప్పోత్సవంగా పిలిచే ఈ కార్యక్రమానికి ముందు స్వామివారిని సంప్రదాయబద్ధంగా గోదావరి తీరానికి తోడ్కొని వచ్చారు. మహిళలు కోలాటమాడుతూ స్వామికి స్వాగతం పలికారు. అనంతరం ఊరేగింపుగా గోదావరి తీరానికి తీసుకొచ్చి హంసవాహనం ఎక్కించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉత్సవ మూర్తులకు హారతి ఇచ్చి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, ఖమ్మం



ఊరేగింపుగా స్వామి వారిని తీసుకొస్తున్న దృశ్యం


వేడుకలకు హాజరయిన ఎమ్మెల్యే పొదెం వీరయ్య, ఈఓ తదితరులు


స్వామి వారిని దర్శించుకుంటున్న ఎస్పీ వినీత్ దంపతులు


హంసవాహన వేదికపై బుట్టలతో విధులు నిర్వహిస్తున్న పోలీసులు

భద్రాద్రిలో భక్తజన సందోహం

- గ్యాలరీలుగా మారిన పుష్కరఘాట్లు
- జనంతో పులకించిన భద్రాద్రి వీధులు
- భద్రాద్రిలో పుంజుకున్న వ్యాపారాలు

భద్రాచలం: తెప్పోత్సవం, వైకుంఠ ద్వార దర్శనం వేడుకలను పురస్కరించుకుని భద్రాచలానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. ఆలయ ప్రాంగణం, గోదావరి తీరమే కాదు పట్టణంలో అన్ని చోట్ల భక్తుల సందడి నెలకొంది. హోటళ్లు కిటకిటలాడాయి. సుమారు మూడేళ్ల తర్వాత భద్రాద్రికి మళ్లీ కళ వచ్చినట్టయింది.

కరోనా తర్వాత

శ్రీరామనవమి, ముక్కోటి పండగల సందర్భంగా భద్రాచలానికి భక్తులు పోటెత్తుతారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగున ఉన్న ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు నుంచి కూడా భక్తులు భారీగా తరలి వస్తుంటారు. కానీ, కరోనా సంక్షోభం కారణంగా 2020 శ్రీరామనవమి వేడుకలు కోవిడ్ నిబంధనల మధ్య భక్తులు లేకుండా జరిగాయి. ఆ తర్వాత కోవిడ్ నిబంధనలు ఎత్తివేసిన తర్వాత భద్రాచాలనికి భక్తుల రాక మొదలైంది. 2021, 2022లలో తెప్పోత్సవాలు భక్తులు లేకుండానే అంతరాలయంలో నిర్వహించారు. రెండు సంవత్సరాల అనంతరం భక్తులకు అనుమతి ఇవ్వడంతో భక్తజనం పోటెత్తారు. కరోనాఛాయలు, వాటి తాలుకు భయాలు ఎక్కడా భక్తుల్లో కనిపించలేదు.

కిక్కిరిసిన బస్సులు

సాయంత్రం నాలుగు గంటల నుంచి భద్రాచలం వచ్చే బస్సులన్నీ భక్తులతో నిండిపోయాయి. సీట్లు సరిపోక చాలా బస్సుల్లో ప్రయాణికులు నిల్చుని వచ్చారు. గంటగంటకూ ప్రైవేట్ వాహనాల్లో వస్తున్న భక్తుల సంఖ్య పెరిగిపోవడంతో పార్కింగ్‌లో వాహనాలకు ప్లేస్ దొరకడం కష్టంగా మారింది. ఇలా అర్ధరాత్రి వరకు భద్రాచలానికి భక్తుల రాక కొనసాగుతూనే వచ్చింది. దీంతో గోదావరి వంతెన దాటిన తర్వాత మొదలు ఆలయానికి వెళ్లే రహదారులు, గోదావరి తీరం, కరకట్ట మొత్తం భక్తులతో నిండిపోయింది. ఆదివారం సాయంత్రం పుష్కర ఘాట్లలోని మెట్లన్నీ భక్తులతో నిండిపోయి స్టేడియంలోని గ్యాలరీని తలపించాయి. ఉత్తర ద్వార దర్శనం కోసం దేవస్థానం ఏర్పాటు చేసిన శిబిరాలు భక్తులతో నిండిపోయాయి.

పుంజుకున్న వ్యాపారం

భద్రాచలంలో దేవస్థానం కాటేజీలతో పాటు అరవై వరకు ఉన్న ప్రైవేట్ లాడ్జీల్లో గదులన్నీ బుక్ అయ్యాయి. టీస్టాళ్లు మొదలు తినుబండారాలు, బొమ్మల షాపులు అంతటా సందడి నెలకొంది. ఆటోలు, జీప్‌లకు తిరిగి గిరాకీ మొదలైంది. తెప్పోత్సవం, ముక్కోటితో భద్రాద్రిలో ఒక్కసారిగా వ్యాపారాలు తిరిగి పుంజుకున్నాయి.

సైడ్‌లైట్స్

- వీఐపీ గ్యాలరీలోకి పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులతో పాటు పాసులు లేని చాలా మందిని అనుమతించడం విమర్శలకు దారి తీసింది.
- తెప్పోత్సవం మొదలైన తర్వాత బాణసంచా కాలుస్తుండగా రెండు సార్లు అపశ్రుతి చోటు చేసుకుంది. నిప్పు రవ్వలు పక్కన ఉంచిన బాణసంచాపై పడటంతో మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు ఆర్పారు. ఎవరికీ గాయాలు కాలేదు.
- తెప్పోత్సవం సందర్భంగా గోదావరి తీరానికి భారీగా భక్తులు చేరుకున్నారు. అయితే తీరంలో ఒకే ఒక్క ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. దీంతో సుదూరం నుంచి హంసవాహనంలో జరుగుతున్న పూజా కార్యక్రమాలు భక్తులకు కనిపించలేదు. ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తే బాగుండేదని భక్తులు అసహనం వ్యక్తం చేశారు.
- గోదావరి తీరం వెంబడి ఏర్పాటు చేసిన గ్యాలరీలు, పుష్కరఘాట్ల దగ్గర సాంబ్రాని వేయడంతో నదీ తీరంలో సరికొత్త అనుభూతి కలిగింది.
- హంసవాహనం దగ్గర విధుల్లో ఉన్న పోలీసు అధికారి తమ పట్ల దురుసుగా ప్రవర్తించారంటూ దేవాదాయ శాఖ ఉద్యోగులు విచారం వ్యక్తం చేశారు.

- భద్రాచలం పంచాయతీపై తొలగని సస్పెన్స్
- జీవో నంబర్ 45పై ప్రభుత్వం మల్లగుల్లాలు
- అసెంబ్లీ సమావేశాల అనంతరమే ఎన్నికలు
- స్పష్టం చేసిన ప్రభుత్వం, హైకోర్టు ధర్మాసనం


భద్రాచలం గ్రామపంచాయతీ భవనం

కొనసాగింపా... ఉపసంహరణా ?!

భద్రాచలం: భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీపై ఉత్కంఠ కొనసాగుతోంది. మూడు పంచాయతీలుగా విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయగా అందుకు వ్యతిరేకంగా విపక్షాలు చేపట్టిన ఆందోళనలు మిన్నంటాయి. ఈ నేపథ్యాన ప్రభుత్వం జీవో ఉపసంహరించుకుంటుందా లేక యథాస్థితి అమలు చేస్తుందా..? అని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా ప్రభుత్వం జీవోను ఉపసంహరిస్తే త్వరలోనే ఎన్నికలు జరిపించే అవకాశం ఉంటుంది. మూడు పంచాయతీలుగా విభజకు అడుగులు వేస్తే ఎన్నికల నిర్వహణకు మరింత సమయం పడుతుంది. విభజన ఫలితంగా వార్డుల సంఖ్య పెరగనున్న నేపథ్యాన రాజకీయ ఆశావహులకు పదవుల పండుగే అని సర్వత్రా చర్చ జరుగుతోంది.

చట్ట సవరణ అనంతరమే ఎన్నికలు..

భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీకి ఎన్నికలు నిర్వహించాలని ఆదివాసీ సంఘ నాయకుడు సొందె వీరయ్య కేసు దాఖలు చేయడంతో హైకోర్టు ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసింది. ప్రభుత్వం తరఫున ప్రత్యేక న్యాయవాది ఏ.సంజీవ్‌కుమార్ భద్రాచలం, సారపాకను పంచాయతీలుగానే కొనసాగించాలని మంత్రి మండలి నిర్ణయించిందని కోర్టుకు వెల్లడించారు. అందుకనుగుణంగా సారపాకను రెండు, భద్రాచలంను మూడు గ్రామపంచాయతీలుగా విభజిస్తూ ప్రభుత్వం ఈ నెల 16న జీవో నంబర్ 45ను విడుదల చేసింది. ఈ మేరకు పంచాయతీలుగా గుర్తించడానికి చట్ట సవరణ చేయాల్సిన అవసరం ఉన్నదని తెలియజేస్తూ సవరణ అనంతరమే ఎన్నికలను నిర్వహణ సాధ్యపడుతుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డితో కూడిన ధర్మాసనానికి వివరించారు. కాగా, రానున్న అసెంబ్లీ సమావేశాల్లో చట్ట సవరణ చేసి ఆపై ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. సమావేశాల అనంతరం ఎన్నికలు జాప్యమైతే మళ్లీ కోర్టును ఆశ్రయించవచ్చని పిటిషన్‌దారుడికి సూచించింది. ఇదిలా ఉండగా ఇప్పటికే ప్రారంభం కావాల్సిన అసెంబ్లీ శీతాకాల సమావేశాలు వాయిదా పడుతుండగా.. జనవరిలో చట్ట సవరణ అనంతరమే మూడు గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. లేదంటే భద్రాచలం ప్రజలు, విపక్షాలు కోరుకున్నట్లుగా మేజర్ గ్రామపంచాయతీగానే కొనసాగిస్తూ సత్వరమే ఎన్నికలు జరపనుంది.


మంత్రి పువ్వాడకు వినతిపత్రం అందచేస్తున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య (ఫైల్)

రాజకీయ నిరుద్యోగులకు పదవుల పండుగ..

భద్రాచలం గ్రామపంచాయతీలో 2013లో ఎన్నికలు నిర్వహించగా సర్పంచ్‌తో పాటు 20 మంది వార్డు సభ్యులతో పాలకవర్గం కొలువుదీరింది. ప్రస్తుతం పట్టణం విస్తరించడంతో పాటు జనాభా 80 వేలు మించిపోయింది. ఈ నేపథ్యాన ప్రభుత్వం మూడు పంచాయతీలుగా విభజించి ఎన్నికలు జరిపిస్తే రాజకీయ నిరుద్యోగులకు పదవుల పండుగే. జీవో నంబర్ 45 ప్రకారం భద్రాచలం, సీతారాంనగర్, శాంతి నగర్ గ్రామపంచాయతీలు ఏర్పాటు కానున్నాయి. దీంతో భద్రాచలం 21, సీతారాంనగర్ 17, శాంతి నగర్‌లో 17 వార్డులతో మొత్తం 55 వార్డులు, మూడు సర్పంచ్ స్థానాలు, అదే విధంగా సారపాక 17, ఐటీసీ 15 వార్డుల చొప్పున మొత్తం 32 వార్డులు, రెండు సర్పంచ్ స్థానాలకు ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది. దీంతో రాజకీయ నిరుద్యోగులకు పదవులు పందేరం నడిచినట్లే అని చర్చోపచర్చలు కొనసాగుతున్నాయి.

'మేజర్'గా కొనసాగించాల్సిందే...

భద్రాచలంను మేజర్ గ్రామపంచాయతీగానే కొనసాగిస్తూ ఎన్నికలను నిర్వహించాలని కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ, సీపీఎం, బీజేపీ డిమాండ్ చేస్తున్నాయి. ఈ మేరకు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ భద్రాచలం బంద్ చేపట్టి విజయవంతం చేశాయి. అదేవిధంగా నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తున్నాయి. మరోవైపు భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య జిల్లా మంత్రి అజయ్‌కుమార్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును వేర్వేరుగా కలిసి తాజా పరిస్థితులను విన్నవించారు. అదేవిధంగా పట్టణ పురప్రముఖులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ తదితర సంఘాలు సైతం ప్రత్యేకంగా సమావేశమై భద్రాచలాన్ని మేజర్ గ్రామపంచాయతీగానే కొనసాగించాలని తీర్మానించాయి. ఇదిలా ఉండగా అధికార బీఆర్‌ఎస్ సహా పలు ఆదివాసీ సంఘాలు మూడు గ్రామపంచాయితీల నిర్ణయానికి జై కొడుతుండడం విశేషం.

ఆశ్రమ పాఠశాల ఆగమాగం..

- మేకను వధించి పోగులు వేసుకున్న ఉపాధ్యాయులు
- బహిర్గతం కావటంతో తలలు పట్టుకున్న టీచర్లు
- విచారణ జరిపిఉన్నతాధికారులకు నివేదిక అందజేసిన ఏటీడీఓ


మేక తల కాల్చుతున్న వర్కర్

ఇల్లెందు: పట్టణ నడిబొడ్డున ఉన్న ఓ బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలను అక్కడి ఉపాధ్యాయులు మటన్‌షాపుగా మార్చారు. కొత్త సంవత్సరం కోసం ఓ మేకను వధించి అక్కడే పోగులు వేసుకుని అదే ఆశ్రమ పాఠశాలలో కాళ్లు, తల కాపుకుని కట్ చేసుకున్నారు. ఆలస్యంగా ఈ విషయం బయటపడటంతో అక్కడి ఉపాధ్యాయులు తలలుపట్టుకున్నారు. ఈమేరకు ఏటీడీఓ రూపాదేవి విచారణ జరిపించారు. వివరాలిలా.. పట్టణ నడిబొడ్డున మున్సిపల్ కార్యాలయం ఎంపీడీఓ కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో గల గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం అక్కడి హెచ్‌ఎం అనుమతితో కొంత మంది ఉపాధ్యాయులు ఓ మేక పోతును కొనుగోలు చేశారు. అనంతరం ఖాళీ స్థలంలో వధించి పోగులు వేసుకున్నారు. బోటీ, కాళ్లు, తలను మాత్రం హాస్టల్లోని పొయ్యి మీద వర్కర్లతో క్లీన్ చేయించి కట్ చేసుకున్నారు. ఈ తతంగం బహిర్గతం కావటంతో ఏటీడీఓ రూపాదేవి ఆదివారం విచారణ జరిపించగా.. అక్కడి ఉపాధ్యాయులు తమ తప్పును అంగీకరించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఏటీడీఓ సాక్షికి తెలిపారు. ఈ విషయమై ఎస్‌ఎస్‌ఎఫ్, డీవైఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాలు తీవ్రంగా ఖండించారు. చట్ట విరుద్ధ చర్యలు చేపడుతున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కట్టుబట్టలే మిగిలాయి..


కట్టు బట్టలతో మిగిలిన బాధిత కుటుంబం

- అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన పూరిల్లు
- రూ.3.50 లక్షల నగదు, 30 తులాల వెండి, మూడు తులాల బంగారం నాశనం
- ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని వేడుకుంటున్న బాధిత కుటుంబం


కాలిన నగదును పరిశీలిస్తున్న ఎస్‌ఐ జితేందర్

అశ్వాపురం: కొత్త సంవత్సరం అని సంతోషంగా దేవుని దర్శనానికి వెళ్లిన ఆ కుటుంబానికి చెడే జరిగింది. విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో వారి పూరిల్లు పూర్తిగా దగ్ధమై సర్వం కోల్పోయి నిరాశ్రయులుగా మిగిలిపోయారు. మంచి ఇల్లు నిర్మించుకుందామని వచ్చిన డ్వాక్రా రుణంతో పాటు పైసా పైసా కూడబెట్టుకున్న నగదుతో సహా మంటల్లో కాలి బూడిదైంది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన గుంజాల చిన్న కృష్ణయ్య భార్య పిల్లలతో నూతన సంవత్సరం సందర్భంగా నెల్లిపాకబంజర గ్రామంలోని వేంకటేశ్వరస్వామి గుడికి వెళ్లాడు. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అయి మంటలు వ్యాపించాయి. దీంతో ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ కూడా పేలడంతో పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా సాధ్యం కాక పూరిల్లు కాలిబూడిదైంది. ఇల్లు నిర్మించుకుందామని కృష్ణయ్య కుటుంబం ఇంట్లో దాచుకున్న రూ.3.50లక్షల నగదుతో పాటు 30 తులాల వెండి, మూడు తులాల బంగారం, బట్టలు, సామన్లు, గిన్నెలు కాలిబూడిదై కట్టుబట్టలతో నిరాశ్రయులుగా మిగిలారు. ఎస్సై జితేందర్, తహసీల్దార్ సురేష్‌కుమార్, సర్పంచ్‌లు కోడి కృష్ణవేణి, మర్రి మల్లారెడ్డి, జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ప్రభుత్వం నుంచి సాయమందేలా చూస్తామని.. తక్షణ సాయంగా ప్రభుత్వం తరఫున 50 కేజీల బియ్యం అందజేశారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు..

కూలీ నాలి చేసుకునే రెక్కాడితే కాని డొక్కాడని కృష్ణయ్య కుటుంబం ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోవడంతో ప్రభుత్వం, దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారులు, ప్రజలు తమకు తోచిన సాయం చేసి ఆదుకోవాలని బాధిత కుటుంబం కోరుతోంది. ఆర్థిక సాయం చేయాల్సిన వారు 84980 67621 నంబర్‌కు ఫోన్‌పే, గూగుల్ పే చేయావలసిందిగా బాధిత కుటుంబం కోరింది. కృష్ణయ్య కుటుంబానికి స్థానికులు తమకు తోచిన సాయం చేస్తున్నారు.

పూర్తిస్థాయి డీడీఓ అధికారాలు ఇవ్వాలి

కొత్తగూడెంఅర్బన్: కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పూర్తిస్థాయి డీడీఓ అధికారాలు ఇవ్వాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. గిరిజన సంక్షేమశాఖ అధికారుల పదోన్నతులలో ఉపాధ్యాయులకు నిష్పత్తిని అమలుచేసి హెచ్‌డబ్ల్యూఓ పదోన్నతులు కల్పించాలన్నారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మక విద్య, పౌష్టికాహారం అందించాలని గొప్ప లక్ష్యంతో జీవో నెంబర్ 56 ద్వారా గిరిజన హాస్టల్స్‌ను కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలకు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. లక్ష్యాన్నిపూర్తిగా అమలు చేయుటకు డీడీఓ అధికారాలు ఇవ్వాలని, రెగ్యులర్ పోస్టులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర బాధ్యులు డి.దేవసింగ్, ఆ.సైదులు, నరసయ్య, హెచ్‌ఎం రామచంద్రయ్య, ఓ.సారమ్మ, బాలు, నాయకులు కిషన్, ఆ.హీరాలాల్, నాగులు తదితరులు పాల్గొన్నారు.

రెండో ఐటీ టవర్ నిర్మాణానికి టెండర్లు

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలో రెండో ఐటీ టవర్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.18 కోట్లు మంజూరు చేయగా అన్‌లైన్ టెండర్ల ప్రక్రియ పూర్తయింది. జిల్లాలోని యువత ఉద్యోగాల కోసం హైదరాబాద్, బెంగళూరుతో పాటు విదేశాలకు వెళ్లకుండా స్థానికంగానే ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన నగరాల్లో టవర్లు నిర్మించి ఐటీ కంపెనీలను ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే ఖమ్మంలో ఐటీ టవర్ మొదటి దశ నిర్మించి 19 కంపెనీలను తీసుకొచ్చారు. యువతకు ఉపాధి కల్పించడం కోసం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రత్యేక దృష్టి పెట్టిన విషయం తెలిసిందే. అదనంగా మరికొన్ని కంపెనీలను తీసుకొచ్చి మరింత మంది యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ఏడాదిన్నర కిందట ఐటీ మంత్రి కేటీఆర్ ఖమ్మంలో రెండో టవర్ నిర్మాణం చేస్తామని బహిరంగసభలో ప్రకటించారు. ఆ మేరకు ప్రస్తుతం ఇల్లెందు క్రాస్ రోడ్డులోని కూరగాయల మార్కెట్ ప్రాంతంలో రెండో టవర్ నిర్మాణానికి స్థలం కేటాయించారు. కూరగాయల మార్కెట్‌ను వీడీఓస్ కాలనీలోని ఖమ్మం నగర ఏసీపీ కార్యాలయం పక్కకు తరలించనున్నారు.

బిడ్ల దాఖలుకు ముగిసిన గడువు

తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ద్వారా రెండో ఐటీ టవర్ నిర్మాణానికి ఆన్‌లైన్ టెండర్లు పిలిచారు. గత నెల 22న టవర్ నిర్మాణం కోసం పేపర్ ప్రకటన జారీ చేశారు. 29న బిడ్ల దాఖలుకు చివరి తేదీగా టీఎస్‌ఐఐసీ లిమిటెడ్ ప్రకటించింది. దాఖలైన ఆన్‌లైన్ బిడ్లను తెరిచి వాటిలో అర్హత ఉన్న వారికి టెండర్లు ఇచ్చి రెండో టవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసేవిధంగా కసరత్తు చేస్తున్నారు.